గోశాలను మేస్తోన్న కంచె

- వెంగళాయపాలెంలో మున్సిపాలిటీ గోవుల దొడ్డి నిర్వహణ
- కాపాలదారులే గోవులు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు
- పశువుల అపహరణ అంటూ ఫిర్యాదు


వెంగళాయపాలెంలోని గోవుల దొడ్డి (ఫైల్ ఫొటో)

గుంటూరు రూరల్: కంచె చేను మేస్తోంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వెంగళయపాలెం గోవుల దొడ్డిలో గోవులను అక్రమంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. గోశాల సిబ్బందిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తుల దాడిచేసి గోవుల్ని తీసుకెళ్లే ప్రయత్నం చేశారని బుధవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కానీ, అసలు విషయం అదికాదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నగరంలో రోడ్లపై తిరుగుతున్న గోవులను ఇక్కడికి మున్సిపల్ అధికారులు తరలిస్తుంటారు. అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న గోవులను కూడా అధికారులు ఈ గోశాలకే తీసుకొస్తారు. గోశాలలో ఇద్దరు కాపలాదారులు పశువుల రక్షణ, దాణా చూస్తుంటారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గోవులకు అవసరమైన మేత, ఇతర సామగ్రి అందిస్తుంటారు.

ఉన్నతాధికారి అండతో విక్రయాలు

గోవుల దొడ్డి కాపలా వ్యక్తులే.. నగర పాలక సంస్థలోని ఓ ఉన్నతాధికారి అండదండలతో గోవులను విక్రయిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. వీరి అక్రమార్జనపై గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంలేకుండా పోయిందని చెబుతున్నారు. రాత్రిళ్లు ఈ దందా యథేచ్ఛగా జరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. బుధవారం రాత్రి 8 గోవులను కాపాలాదారులే రూ.56 వేలకు విక్రయించారని, దీనిని కొందరు చూడటంతో గోవులను దొంగతనం చేయబోయారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

లెక్కలు లేవు.. లెక్కలేదు

గతేడాదిగా గోవుల దొడ్డిలోకి వస్తున్న ఆవులకు ఎలాంటి లెక్కలు లేవు. దీంతో కాపలాదారులే అక్రమాలకు లెక్కలేకుండా పోయిందని అంటున్నారు. ఒక్కో గోవును రూ.8 నుంచి రూ.10వేలకు విక్రయిస్తున్నారన్న విమర్శలున్నాయి. కేవలం అర్ధరాత్రిళ్ల మాత్రమే.. గోవులను వాహనాల్లో తరలిస్తారని గోవులదొడ్డి సమీప నివాసులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ గోవుల దొడ్డిపై లేకపోవడంతో పాటు పశువుల విక్రయాల్లో ఉన్నతాధికారుల హస్తాలు ఉండటంతో.. అక్రమార్కుల ఆటలు సాగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా గోవులను అక్రమంగా విక్రయాలపై తగిన చర్యలు తీసుకుని అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ



ప్రత్తిపాడు: నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ అన్నారు. మండల కేంద్రం వట్టిచెరుకూరులోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం డీఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సీఐ రమానాయక్, ఎస్‌ఐ సుబ్బారావులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలైన గారపాడు, యామర్తిల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భానూదయ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతుండటంతో స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని డీఎస్పీ పరిశీలించారు.

26న మాంసం, మద్యం దుకాణాలు బంద్

పొన్నూరు: ఈ నెల 26న రిపబ్లిక్ డే పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధిలోని మాంసం, చేపలు విక్రయ దుకాణాలు తెరవకూడదని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు భిన్నంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొన్నూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్ షాపులు, బార్లు కూడా తెరవకూడదని ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు. వ్యాపారులు తప్పక నిబంధనలు పాటించాలని అన్నారు.

లలితా హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పెదకాకాని: గుంటూరు లలితా సూపర్‌స్పెషాలిటీస్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ పమిడిముక్కల విజయ, పెదకాకాని గుడి ముఖ్య అర్చకులు నందివెలుగు కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. మెగా ఉచిత వైద్య శిబిరంలో హార్ట్, బ్రెయిన్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్ కేసులు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి 10 మందిలో ఒకరికి క్యాన్సర్ రావటం చాలా బాధాకరమని అన్నారు. పాప్ స్మియర్, మామోగ్రామ్, సీటీ చెస్ట్, ఎండోస్కోపీ, బయాప్సీ వంటి వైద్య పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించవచ్చన్నారు. పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేసినట్లు డాక్టర్ విజయ తెలిపారు. వైద్య శిబిరాన్ని 250 మందికి పైగా వినియోగించుకున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ దీప్తి, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫణిరాజ్, డాక్టర్ మధు, హెచ్‌ఆర్ మేనేజర్ అభిషేక్, షాహిద్, మణికంఠ, పారామెడికల్, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రిజర్వేషన్‌ల విభజనతో గౌడలకు అన్యాయం

పెదకాకాని: కూటమి ప్రభుత్వం రిజర్వేషన్‌ల విభజనతో గౌడ కులస్తులకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర గౌడ సంఘం నాయకులు అనుమోలు ఏడుకొండలు అన్నారు. పెదకాకానికి చెందిన గౌడ సంఘం నాయకులు శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్యం పాలసీలో గీత కులాల రిజర్వేషన్‌లలో జిల్లాకు గౌడ్ 4 షాపులు, గౌడ 9 బ్రాందీ షాపులు ప్రకటించారు. గౌడ సర్టిఫికెట్ వాడుక భాషలో పలికే పదాలను బట్టి గౌడ, గౌడ్ అని సర్టిఫికెట్‌లు మారి ఉండవచ్చని, తామంతా ఒకటే కులమని కలెక్టర్‌కు వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యను గుర్తించి రెవెన్యూ డివిజన్‌లోని అధికారులు తహసీల్దార్‌లకు గౌడ్, గౌడ ఇద్దరూ ఒకటేనని గుర్తించి ఒకే రిజర్వేషన్ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గౌడ సంఘం నాయకులు రాంప్రసాద్, వెంకటకృష్ణ, నవీన్‌కృష్ణ, శివాజీ, పూర్ణచంద్రరావు, రామ్మూర్తి, పరశురాం, వెంకయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 40 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ తెలిపారు. స్థానిక కళాశాలలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న సీఎస్‌ఈ, ఏఐ, ఐటీ, ఈసీఈ విభాగాల విద్యార్థులకు శుక్రవారం పెంటగాన్ స్పేస్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో కళాశాలకు చెందిన 40 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనం రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు తెలిపినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ ఎం బీవీ సత్యనారాయణ అభినందించారు. పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

గుంటూరు జిల్లా జేసీ భార్గవ్‌తేజ

పెదకాకాని: రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జేసీ భార్గవ్‌తేజ అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో ప్రారంభమైన రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీ సర్వే సమగ్రంగా జరగాలన్నారు. రైతులకు సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే చేయాలని సూచించారు. రైతులు వారి వద్ద ఉన్న ఆధారాలతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మ్యుటేషన్ చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రీ సర్వే జరగాలన్నారు. గ్రామ రెవెన్యూ చిత్రపటాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, మండల సర్వేయర్ వీరాంజనేయులు, సచివాలయ సర్వేయర్‌లు, సిబ్బంది ఉన్నారు.

వీవీఐటీ అధ్యాపకునికి డాక్టరేట్


వీవీఐటీలో అధ్యాపకునికి డాక్టరేట్ పట్టా అందజేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన తోట శేషు చక్రవర్తి సామాజిక మాధ్యమాలపై చేసిన పరిశోధనలకు అన్నా యూనివర్శిటీ చెన్నై నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో శుక్రవారం చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ తోట శేషు చక్రవర్తి వినూత్న కేంద్రీకృత చర్యల ద్వారా సంక్లిష్ట నెట్‌వర్క్‌లో ప్రభావవంతమైన నోడ్‌లను గుర్తించడంపై చేసిన పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ లోకేష్ పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. అనంతరం తోట శేషు చక్రవర్తిని చైర్మన్ విద్యాసాగర్, వైస్ చైర్మన్ మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ గిరిబాబు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రామచంద్రన్ అభినందించారు.

ధూళిపాళ్ల వీరయ్య చౌదరికి నివాళి

పొన్నూరు: పట్టణంలో మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ సెంటర్‌లోని ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి విగ్రహానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేబ్రోలు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రెవెన్యూ శాఖ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి వర్ధంతి సందర్భంగా శుక్రవారం చేబ్రోలు మండలంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. చేబ్రోలు–నారాకోడూరు గ్రామాల మధ్య ఉన్న వీరయ్య చౌదరి స్థూపానికి పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్లమూడి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీవీసీ హాస్పటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు


చేబ్రోలు: వెనుక నుంచి వచ్చిన కారు ముందు వెళ్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తూ ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటనపై శుక్రవారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని వడ్లమూడి గ్రామానికి చెందిన టి.బాబారావు గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భార్యకు అనారోగ్యంగా ఉండటంతో హాస్పిటల్‌కు తీసుకువెళ్లటం కోసం గురువారం గుంటూరు నుంచి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. నారాకోడూరు గ్రామ పరిధిలోని పంజాబీ హోటల్ సమీపంలో వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాబురావుకు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిట్స్‌లో ముగిసిన అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం


కిట్స్‌లో జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఏఐఎంఎల్ అండ్ బయోమెడికల్ సిస్టమ్స్‌పై నాలుగు రోజులుగా జరుగుతున్న అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసీటీ అకాడమీ ఐఐటీ రూర్కీ, ఆన్ ఇనిషియేటివ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్–ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైబ్రిడ్ పద్ధతుల్లో అధ్యాపకులకు 20 నుంచి 24వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఎఫ్‌డీపీ ద్వారా అధునాతన పరిజ్ఞానం, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌లుగా హాజరైన డాక్టర్ తరుణ్ కుమార్ రెడ్డి (ఐఐటీ రూర్కీ), డాక్టర్ జె.రవికుమార్ (ఎన్‌ఐటీ వరంగల్), డాక్టర్ అన్షుల్ జైస్వాల్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ సుభజిత్ రాయ్ (ఐఐటీ మండి), డాక్టర్ ఆర్.ఎస్.ఆనంద్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ గౌరవ్ కుమార్ నాయక్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ రామ్‌బిలాస్ పచోరి (ఐఐటీ ఇండోర్, ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్), శ్రీనివాస్ జిల్లా హెడ్ ఆఫ్ హిటాచీలు పాల్గొని ఆయా సాంకేతిక అంశాలపై అధ్యాపకులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఎఫ్‌డీపీలను సద్వినియోగం చేసుకుని అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, ఈసీఈ విభాగాధిపతి ఆదినారాయణ, కోర్సు కో ఆర్డినేటర్ ప్రొ. సంజీవ్ మన్హాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సరళ పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు

పెదకాకాని: అందరి సమన్వయంతో పెదకాకాని మండలాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. ముందుగా ఎంపీటీసీ సభ్యులకు 11 నెలలుగా గౌరవ వేతనాలు నిలిపివేయడంపై సభ్యులు నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు సభ నిలిచిపోయింది. ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు ఉన్నతాధికారులను సంప్రదించి శనివారం పూర్తి సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలియజేయడంతో తిరిగి ప్రారంభమైంది. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తే పెదకాకాని మండల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి పనులు చేయాలన్నారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ముందుగా శాఖల వారీగా అధికారులు వారి పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులపై వివరించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతపై అధికారులను నిలదీశారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడపిల్లల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఎంఈఓ–1 కెనడీ


మాట్లాడుతున్న ఎంఈఓ–2 విజయ్ భాస్కర్


బహుమతులు అందజేస్తున్న సీడీపీవో సుజాతదేవి, అడిషనల్ సీడీపీవో విజయనిర్మల

కాకుమాను: ఆడపిల్లల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలికా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు ఆడపిల్లల విద్యను ప్రోత్సహించి వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఆడపిల్లల విద్యతోనే గ్రామాలు, దేశం అభివృద్ధి చెందుతాయని ప్రతి ఒక్కరు ఆడపిల్లల విద్యకు సహకరించాలని కోరారు. ఆడపిల్లల విద్య, ఉపయోగాలపై పలువురు విద్యార్థినులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవితకు కృషి

ప్రత్తిపాడు: బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో వి.సుజాతదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు 'ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికల సాధికారత' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు సీడీపీవో సుజాతదేవి, అడిషనల్ సీడీపీవో విజయనిర్మల బహుమతులను అందించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవో మాట్లాడుతూ సమాజంలో బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతలపై అవగాహన కల్పించారు. అడిషనల్ సీడీపీవో విజయనిర్మల మాట్లాడుతూ అన్ని రంగాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల అధ్యాపకురాలు సధ్యారాణి, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేబ్రోలులో జాతీయ బాలికా దినోత్సవం

చేబ్రోలు: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చేబ్రోలు ఎస్‌ఐ డీవీ కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న మోసాలు, ప్రేమ వివాహాలు చేసుకొని ఎలా మోసపోతున్నారో వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

ప్రత్తిపాడు: బాలికా విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్య ద్వారానే మహిళలు రాణించగలుగుతారని నమ్మి, సావిత్రిబాయి పూలే మొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారని గుర్తుచేశారు. గ్రామస్తులు గడ్డిపాటి పద్మారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామర్స్ విభాగంలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో యూజీసీ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. 'అడ్వాన్సెస్ ఇన్ బిజినెస్ ఎనలిటిక్స్ అండ్ ఇంటిలిజెన్స్' అనే అంశంపై ఫిబ్రవరి 14, 15 తేదీలలో సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సురేష్ కుమార్ ఆవిష్కరించారు. శివరాం ప్రసాద్ మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, విదేశీయులు, తమ పరిశోధన పత్రాలను ఫిబ్రవరి 10వతేదీలోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పొన్నూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్ సాకర్యం నిలిపి వేస్తున్నట్లు ఏఈ కె.వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి కలుగుతున్న అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని తెలిపారు.

నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే రామాంజనేయులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామంజనేయులు

కాకుమాను: మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మాదిరిగా అధికారులు కార్యాలయాల్లో కూర్చుంటే కుదరదని ప్రతి అధికారి గ్రామాలలోని పార్టీ నాయకులతో కలిసి సమన్వయంగా పని చేయాలని ఆదేశించారు. గ్రామాలలో చేపట్టవలసిన పనులను గుర్తించి గ్రామాలలోని నాయకులకు తెలియజేయాలని సూచించారు. సుమారు రూ.110 కోట్ల నిధులతో గుంటూరు చానల్ పొడిగింపు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పుసులూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు మండలంలోని గ్రామాలలో రెండు వర్గాలు ఏర్పడ్డాయని ముందు ఆ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాగా మరో పది, పదిహేను రోజులలో గ్రామాలలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు, సైనికపురి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జీఎంసీ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపుకు అభివృద్ధి పనులను నేరుగా పరిశీలిస్తామన్నారు. పనుల్లో నాణ్యత లోపాలు గమనిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు, పర్యవేక్షణ అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏటీ అగ్రహారం మస్టర్ పాయింట్‌ని పరిశీలించి కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, జీరో బ్లాక్ స్పాట్స్, తడిపొడి వ్యర్థాల విభజన జరిగేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు కృషి చేయాలన్నారు. డీఈఈ సతీష్ కుమార్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



కాకుమాను: పొగాకు సాగు చేస్తున్న రైతులందరు సాగు విషయంలో ఆధునిక నూతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ అన్నారు. పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పొగాకు పొలాలను శుక్రవారం సాయంత్రం ఆయన తన బృందంతో పరిశీలించి మాట్లాడుతూ ఏటా ఒకే పద్ధతిలో సాగు చేయకుండా ఆధునిక పద్ధతులతో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు పి.హరిబాబు గత 2 సంవత్సరాల నుంచి ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు పొగాకు నాణ్యత బాగుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర గురించి ప్రస్తావించగా అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌ను బట్టి ధర ఉంటుందని బోర్డు అనుమతి మేరకు ప్రతి రైతు నుంచి కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ

పొన్నూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్టణంలో ర్యాలీ, మానవ హారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన కొనసాగుతుందని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లకు సన్మానం, వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సహాయకులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొనాలని కోరారు.